ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 20 ఆగస్టు 2024



నాచు, జమ్ము పేరుకుపోయిన తాగునీటి చెరువు



జాడలేని కుళాయి!

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు విస్మరించింది. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చేసరికి దారుణంగా విఫలమయ్యారు. జలజీవన్ మిషన్ పథకం పనులను అటకెక్కించారు. ఐదేళ్లు పనులను సాగదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలజీవన్ పథకంపై పల్లె ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల మందు కూటమి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.



ఓవర్ హెడ్ ట్యాంక్

- అటకెక్కిన జలజీవన్ పథకం
- నీటి పథకాల పనుల సాగదీత
- పల్లెల్లో తాగునీటికి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షల గృహాలు
- కుళాయిల శాతం 43.66
- రాష్ట్రంలోనే చిట్ట చివరన పల్నాడు జిల్లా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జల్ జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజక వర్గాలలోని అనేక గ్రామాలలో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు సేవిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్ జీవన్ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తికీ 40 లీటర్లు నీరు ఇచ్చే విధంగా రూపొందించారు. వీటి సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పనులను గుర్తించి చేపడుతున్నారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ. 1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటాగా సుమారు రూ. 275 కోట్లు నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ. 105 కోట్లు విడుదల చేసింది. ఇంకా మిగతా నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడం మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,51,267 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.68 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,637 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,033 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,48,325 గృహాలకు మాత్రమే కుళాయి కనక్షన్‌లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.64 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,463 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్‌లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి. 10 గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కొరుతాడిపర్రు, ఇంకొల్లు మండలం భీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దన పూడి మండలం వింజనంపాడు గ్రామల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ..

పల్నాడు జిల్లాలోని గ్రామాలలో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన్పటి నుంచి ఇప్పటి వరకు 87,052 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,218 గృహాలకు కుళాయిలు ఉండగా ఇంకా 2,89,328 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. 33.43 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ 508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 13 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది. అమరావతి మండలం జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లి వారిపాలెం, పొతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమావిళ్ల, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజు పల్లి గ్రామల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు.



జలజీవన్ మిషన్ పథకం పైపులు

గుంటూరు జిల్లాలో ...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. ఈ గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పాండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జెడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కుర్నూతల, వట్టిచెరకూరు, యామర్రు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి నీరు సరఫరా అవుతోందని సదరు అధికారులు తెలిపారు.

పోషణ కష్టాలు



- అంగన్వాడీలకు ఆగిన సరుకుల సరఫరా
- జులై నెలలో సగం కేంద్రాలకే కందిపప్పు
- మూడో వంతు కేంద్రాలకు ఆగిన పామాయిల్
- సగం కేంద్రాలతో సరిపుచ్చిన పౌర సరఫరాల శాఖ
- వైసీపీ నిర్వాకంతో కుదేలైన పౌర సరఫరాల కార్పొరేషన్
- ఇప్పటికే దెబ్బతిన చౌక సరుకుల పంపిణీ
- తాజా పరిస్థితులతో అంగన్వాడీలపైనా తీవ్ర ప్రభావం

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంతో నిర్వీర్యమైన వ్యవస్థల జాబితాలో తాజాగా అంగన్వాడీ కేంద్రాలు కూడా చేరుతున్నాయి. అర్థాకలి జీవితాలు గడిపే పేద సాద తల్లులు, పిల్లల ఆకలి తీర్చి పోషణనిచ్చే అంగన్వాడీ కేంద్రాలు నేడు పోషణ కరువై అల్లాడుతున్నాయి. అంగన్వాడీలకు రావాల్సిన సరుకులు రాక మళ్లీ అదే అర్థాకలితో తల్లులు, పిల్లలు అగచాట్లు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకు కారణం పౌర సరఫరాల శాఖ కుదేలైపోవడమే కారణంగా తెలుస్తోంది.

కందిపప్పు కనుమరుగు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 23 కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,405 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 50 వేల మంది గర్భిణులు, 55వేల మంది బాలింతలు, లక్షా 10 వేల మంది మూడేళ్లలోపు చిన్నారులు, లక్షా 32వేల మంది 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు వీటిద్వారా ప్రతినెలా పోషకాహారాన్ని అందిస్తున్నారు. పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో కందిపప్పు, 3 కిలోల బియ్యం, అరలీటరు మంచినూనె అందిస్తారు. వీటితోపాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో వెయ్యి అంగన్వాడీ కేంద్రాలు వున్నాయి వీటిలో సుమారు లక్షమంది బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషణ పొందుతున్నారు. ప్రస్తుతం వారిలో సగం మందికి ఈనెల కందిపప్పు, మూడింట ఒక వంతు మందికి పామాయిల్ అందలేదు.

- గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు 24,418 కిలోల కందిపప్పును అందించాల్సి వుండగా, 8,817 కిలోల కందిపప్పు మాత్రమే అందజేశారు. అరకిలో పామాయిల్ ప్యాకెట్లు 17,494 కేటాయించగా 15,560 ప్యాకెట్లు, ఒకలీటరు ప్యాకెట్లు 1,911కుగానూ 1,119 ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేయగలిగారు. పల్నాడు జిల్లాలో 34,990 కిలోల కందిపప్పుకుగానూ 27,885 కిలోల కందిపప్పును, 21,118 అరలీటరు పామాయిల్ ప్యాకెట్లకుగానూ 17,745 ప్యాకెట్ల పామాయిల్, 4,022 లీటర్ ప్యాకెట్లకుగానూ 1,792 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 20,845 కిలోల కందిపప్పుకుగానూ 18,799 కిలోలు, 13,378 పామాయిల్ అర లీటరు ప్యాకెట్లకుగానూ 10,379 ప్యాకెట్లు, 2,126 లీటరు ప్యాకెట్లకుగానూ 631 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. దీంతో మూడు జిల్లాలో వున్న సగం అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషణ అందలేదు.

సంక్షోభంలో పౌర సరఫరాల కార్పొరేషన్

గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల కార్పొరేషన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్పొరేషన్‌పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి సంస్థను నిర్వీర్యం చేసింది. దీంతో ప్రతి నెలా సరఫరా చేసి సబ్సిడీ సరుకులు సరఫరా కూడా చేయలేని దీనావస్థకు పౌర సరఫరాల శాఖ దిగజారింది. కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతున్నప్పటికీ సంక్షోభ తీవ్రత కారణంగా సరైన పరిష్కారం కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. అన్ని విధాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన పౌర సరఫరాల శాఖ గత రెండేళ్లుగా పేద ప్రజలకు చౌక డిపోల ద్వారా అందించాల్సిన కందిపప్పు, పామాయిల్‌ను కూడా అందించకుండా ఆపేసింది. ఇప్పుడు ఆ సంక్షోభం అంగన్వాడీ కేంద్రాలను చుట్టుముడుతోంది. వైసీపీ హయాంలో ఏడాది క్రితం ఇదే పరిస్థితి వుండగా ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు నుంచి పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించింది. తీరా చూస్తే అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాం గం చర్యలు తీసుకోక పోతే అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ కార్య క్రమం పూర్తిగా నీరుగారి పోయే ప్రమాదం కనిపిస్తోంది.

అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ జె.వెంకటమురళీ



ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, జేసీ సుబ్బారావు

బాపట్ల,ఆగస్టు 19 : బాధితులు నుంచి వచ్చిన అర్జీలు తక్షణమే నాణ్యతతో పరిష్కరించి మేలు జరిగేలా చూడాలని కలెక్టర్ జే వెంకటమురళీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి అర్జీ దారులు తమ సమస్యలను పరిష్కరిచాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 91 అర్జీలు రాగా రెవెన్యూ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్‌రికార్డ్స్, పోలీసు, సీపీ, డీసీఎల్, మార్కెటింగ్, పురపాలకశాఖ, నీటిపారుదల, గృహనిర్మాణం, చేనేత, దేవాదాయ, పంచాయతీరాజ్, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలకు సంబంధించి నమోదయ్యాయని తెలిపారు. కలెక్టర్ తన పరిధిలో వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి పరిశీలన, విచారణ చేయాలంటూ సంబంధితాధికారులకు పురమాయించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించటంలో అలసత్వం చేయరాదని అధికారులకు సూచనలు చేశారు. అర్జీదారులకు మీ పరిధిలో పరిష్కారం జరిగితే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎందుకు వస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. అర్జీదారుల సమస్యను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బీ సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉండవల్లిలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్‌కు హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ప్రజాదర్బార్‌లోనూ లోకేశ్‌కు పలువురు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెమ్మలకు మంత్రి నారా లోకేశ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.





వాడరేవు, రామాపురం మధ్య రోడ్డుకు ఇరువైపుల కనిపించని గతంలో నాటిన మొక్కలు

మొక్కలు ఎక్కడ..?

- కాగితాలకే పరిమతమైన జగనన్న పచ్చతోరణం
- క్షేత్రస్థాయిలో కనిపించని వనాలు
- ఖర్చు ఘనం.. ఫలితం శూన్యం

చీరాల, ఆగస్టు 19 : జగనన్న పచ్చతోరణం పేరుతో గత ప్రభుత్వ హయాంలో మొక్కలను నాటి, సంరక్షించేందుకు చేపట్టిన ప్రక్రియ ప్రహసనంగా సాగింది. నాటిన మొక్కలు కాగితాలలో పదిలంగా ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో ఒక్క మొక్క కనిపించడం లేదు. ఖర్చు ఘనం, ఫలితం శూన్యమని ప్రజలు పెదవి విరుస్తున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా గతంలో జరిగిన అక్రమాలను వెలికితీసి తగిన చర్యలు చేపట్టటంతో పాటు, అవసరమైనచోట మొక్కలు సంరక్షణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కరిగిన నిధులు..కనిపించని మొక్కలు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చేసిన నిధుల వినియోగం భారీ స్థాయిలో ఉన్నాయి. కేటాయించిన నిధులు మంచుముక్కలా కరిగిపోయాయి. నాటిన మొక్కలు కనిపించడం లేదు. సక్రమంగా నాటకపోవడం, తరువాత సంరక్షణ లేకపోవడం అందుకు కారణం. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు కింద నుంచి పై స్థాయి వరకు మౌనంగా ఉన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత లేదు. అందరి భాగస్వామ్యం ఉండడమే అందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మొక్కుబడిగా సోషల్ ఆడిట్

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో జరిగిన పనులకు సంబంధించి ఇటీవల ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో డొల్లతనం వెల్లడైంది. కొన్నిచోట్ల జిల్లా అధికారులు ఆ చర్యలను సమర్థించడం విమర్శలకు తావిచ్చింది. తీరంలో చేపట్టిన పనులకు సంబంధించి విమర్శలు వెల్లువెత్తాయి. నాటిన మొక్కలు, తీసిన చెరువులు కనిపించకపోవడం అందుకు కారణం. ప్రాథమికంగా నర్సరీలలో మొక్కలను ఏపుగా పెంచాలి. ఆ తరువాత వర్షాలు సక్రమంగా ఉన్నప్పుడు గుంతలు లోతుగా తీయించి అవసరమైన మంచిమట్టిని జోడించి మొక్కలు నాటాలి. పశువుల నుంచి రక్షణకు కంచె ఏర్పాటు చేయాలి. తరువాత బెట్ట సమయాల్లో నీటి తడులు ఇవ్వాలి. ఇవన్నీ క్షేత్ర స్థాయిలో చేస్తున్నారా అంటే లేదనే సమాధానం వస్తోంది.

నాటిన మొక్కల్లో సగం బతికినా

నాటిన మొక్కల్లో సగం బతికినా జిల్లా అంతటా పచ్చదనం, ఆహ్లాదం గణనీయంగా ఉండేది. అయితే ఆ పరిస్థితి ఎక్కడా లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తమ ప్రాంతాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటిన తరువాత సంరక్షణ చర్యలు చేపట్టని అధికారులు, సిబ్బందిని ప్రశ్నించడంగానీ, సంరక్షణలో తాము భాగస్వాములు కావడంగానీ లేదు. ఎవరికి వారు వినియోగించే డబ్బు మనది కాదులే అనే భావనతో ఉండటమే మొక్కల పెంచే ప్రక్రియ రాజుగారి పాలల్లో నీళ్లుగా మారుతోంది. ఈ ప్రభుత్వమైనా గత చేతివాటాలను నియంత్రించి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా టీడీపీ పాలన



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 19 : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం కొల్లూరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోలేదని, టీడీపీ హయాంలో పుష్కరాలు సమయంలో వేసిన రోడ్లు తప్పితే ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధి కనిపించలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల ప్రజలకు అండగా ఉండేది ఎల్లప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు ఎమ్మెల్యే ఆనందబాబుకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఘైనేని మురళీ కృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ పాల్గొన్నారు.



దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6ః1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బ తీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.



బ్రహ్మా ఆనందం సందడి

హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కూర్గ్‌లో పెళ్లి

'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్లాం"ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో ఆలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం ఆక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

'హ్యాపీ రక్షా బంధన్'



"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.

ఇష్టమైన సమయం వచ్చేసింది



"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థ్యాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

నిన్ను బాగా మిస్సవుతున్నాను



"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్ రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.



హీరో కృష్ణ అభిమాని సినిమా

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.


అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న పెమ్మసాని, నసీర్, రాజేంద్ర ప్రసాద్

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు: కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రూ.200 ఖర్చుపెట్టినా కాఫీ, టీలు దొరకని ఈ రోజుల్లో కేవలం రూ.5కే అన్నం పెట్టడం అంటే సాధారణ విషయం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు బస్టాండు సమీపంలో ఇటీవల ప్రారంభించిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నసీర్, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత రాజేంద్రప్రసాద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు దగ్గరుండి వడ్డన చేశారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, సౌకర్యాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడే వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. నిత్యం 350మందికి ఒక్కో అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. భోజనం రుచికరంగా వుందని ఆయన చెప్పారు. పరిసరాలు, మెనూ సంతృప్తికరంగా వుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనపై పెమ్మసాని పిలుపునందుకుని చొరవ చూపి తనను కలవడానికి వచ్చిన కాంటినెంటల్ కాఫీ అధినేత రాజేంద్రప్రసాద్‌ను ఆయన అభినందించారు. గుంటూరు జిల్లాలో పరిశ్రమలు లేని రోజున కాంటినెంటల్ కాఫీ సంస్థను స్థాపించిన రాజేంద్రప్రసాద్ వంటివారు నేడు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు పెమ్మసానికి రాఖీ కట్టారు. ఎల్లప్పుడూ అన్నయ్యలా తోడుంటానని పెమ్మసాని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, పోతురాజు సమత, సయ్యద్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లకు క్యూఆర్ కోడ్ పరికరాల అందజేత


క్యూ ఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను అందజేస్తున్న గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ డివిజన్ కమర్షియల్ విభాగం అధికారులకు అందజేశారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఆయన సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబులకు అందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డిజిటలైజేషన్‌లో రైల్వేశాఖ ఎంతోచొరవ చూపుతున్నదన్నారు. ఈ క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలు ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. టిక్కెట్ ఛార్జీని క్యూఆర్ కోడ్ స్కానర్‌లో స్కానింగ్ చేసి చెల్లింపు చేయవచ్చన్నారు. దీనివలన నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయన్నారు. కౌంటర్ల వద్ద చిల్లర కష్టాలు కూడా తీరిపోతాయని చెప్పారు.

అందరికి అండగా ఉంటా...

● మంత్రి లోకేశ్ భరోసా ● 27వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ

తాడేపల్లి, ఆగస్టు 19: సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 27వ రోజు సోమవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నేరుగా మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి లోకేశ్... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

సమస్యలిలా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి విచారణ లేకుండా తన భర్తపై అక్రమంగా కేసు నమోదు చేసి, ఇంట్లోని 148 గ్రాముల బంగారాన్ని పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారని మంగళగిరికి చెందిన అందె స్వర్ణలత మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అంకమ్మరావు, ఎస్ఐ నారాయణ తమను వేధించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగురాలైన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లికి చెందిన ఎస్ కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని నవులూరుకు చెందిన సోలా శ్రీదేవి కోరారు. రోజువారీ పనులతో జీవనం సాగించే తనకు రాజధాని రైతు కూలీ పెన్షన్ మంజూరు చేయాలని ఉండవల్లికి చెందిన టి కిషోర్ విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తనకు ముగ్గురు పిల్లల పోషణ కోసం ఎయిమ్స్ ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన కె.ప్రసన్న కోరారు. వైసీపీ నాయకుల అండగా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చౌటూరులో తమ 220 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తగిన న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన అడపా మస్తాన్‌రావు విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ కోర్సు సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలేజి యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని సర్టిఫికెట్ మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాతూరుకు చెందిన అనూష కోరారు. ఈఎస్ఐ కింద గుండె ఆపరేషన్ చేయించుకున్న తనకు బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కాజకు చెందిన కె శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. నూతనంగా నిర్మించుకున్న తన ఇంటికి దారి ఇవ్వకుండా వైసీపీ నేతలు అడ్డంగా గోడ కట్టారని, నెల్లూరు జిల్లా వరికుంటపాడు గండిపాలెంకు చెందిన డి తిరుపతమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని విజయవాడకు చెందిన హరిత విజ్ఞప్తి చేశారు. అగ్రికల్చర్‌లో డిప్లమో చేసిన తాను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సీడ్ ప్రొడక్షన్‌లో శిక్షణ పొందానని తగిన ఉద్యోగం కల్పించాలని ప్రకాశం జిల్లా గద్దలకుంటకు చెందిన పిల్లి ప్రసన్నకుమారి విజ్ఞప్తి చేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా మేళ్లవాగుకు చెందిన యు వెంకటేశ్వర్లు కోరారు. వారసత్వంగా వచ్చిన తమ ఏడెకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు నకిలీపత్రాలతో కబ్జా చేశారని విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం సాతానుపల్లికి చెందిన కంచర్ల హజరత్తమ్మ మంత్రి లోకేశ్‌ను కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. డిస్ట్రిక్టు స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకంలో నిబంధనలు సడలించి వ్యాయామ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని కోరారు.


వైద్యసాయం కోసం వచ్చిన వృద్ధుల్ని పరామర్శిస్తున్న లోకేశ్



ఎయిమ్స్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

మాచర్లటౌన్, ఆగస్టు 19: మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను సోమవారం ఆయన జెండా ఊపి, బస్ స్టార్ట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వంతో మాట్లాడి అత్యాధునిక సదుపాయాలతో మంగళగిరిలో ఎయిమ్స్ హాస్పిటల్‌ను ఏర్పాటుచేశారన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఎయిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకునేందుకు గుంటూరు వరకు వెళ్లి అక్కడి నుంచి హాస్పిటల్‌కు చేరుకోవడానికి పలు ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం ప్రత్యేకంగా నేరుగా హాస్పిటల్ వద్దకు చేరుకునేందుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో బస్సు సర్వీసు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం డిపో మేనేజర్ రెంటచింతల పిచ్చయ్యను అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బండ్ల శ్రీనివాసరావు, వజ్రం నాయక్, మదార్‌సాహెబ్, కొమెర శివ, గుండాల శ్రీనివాస్ యాదవ్, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, శేషు, చల్లా రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మమతానురాగాల బంధమే రక్షాబంధన్

● మంత్రి అనగానికి రాఖీ కట్టిన సోదరీమణులు


మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు డాక్టర్ మంజుల, డాక్టర్ కమల

రేపల్లె, ఆగస్టు 19: హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టటం అంటే సోదరికి జీవితాంతం రక్షగా ఉంటానని సోదరుడు భావించే పండుగ. అన్నాచెల్లెళ్ళు అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రక్షాబంధన్ పండుగను ఘనంగా సోమవారం జరుపుకున్నారు. శ్రావణమాసం రాఖీపౌర్ణమి సందర్భంగా రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, సోదరుడు శివప్రసాద్‌లకు సోదరీమణులు డాక్టర్ అనగాని మంజుల, కమల రాఖీ కట్టి హారతులు ఇచ్చి మిఠాయిని తినిపించి వారి ఆశీర్వాదం పొందారు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో జన్మించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబం తండ్రి రంగారావు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి రోజున తమ సోదరులైన శివప్రసాద్, సత్యప్రసాద్‌లకు రాఖీ కట్టి వారి ఆశీస్సులు తీసుకుంటామని తెలిపారు. 40 ఏళ్ళ నుంచి వృత్తిరీత్యా వేర్వేరు చోట్ల ఉన్నా రాఖీ పౌర్ణమిరోజున కుటుంబసభ్యులంతా హైదరాబాద్‌లోని తమ స్వగృహంలో చేరి సోదరులకు రాఖీ కట్టి పండుగ జరుపుకుంటామని తెలిపారు.

క్యాంటీన్‌ల వద్ద ఎండలో అవస్థలు

● నీడ కల్పించే అంశంపై ఆలోచన చేయాలి ● పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్‌లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు రోజూ వేలాది మంది కడుపు నింపుతున్నాయి. మూడు పూటలా క్యాంటీన్‌ల వద్ద పేదలు బారులు తీరుతున్నారు. ఒక్కొక్క క్యాంటీన్‌లో నాలుగు రోజుల్లో దాదాపు ఆరువేల మంది అల్పాహారం, భోజనం చేశారు. కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడంలో భరోసా కల్పించింది. ఎంతో ఆనందంగా అన్న క్యాంటీన్‌లకు పేదలు తరలివస్తున్నారు. రుచి, నాణ్యత గల ఆహారాన్ని ప్రభుత్వం క్యాంటీన్ ద్వారా పేదలకు అందిస్తోంది. అన్ని బాగున్నా చిన్న సమస్య పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం సమయాల్లో ఇబ్బందులు లేవు. ఎటొచ్చి మధ్యాహ్నం భోజన సమయంలో క్యాంటీన్ వద్ద పేదలు అవస్థలు పడుతున్నారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండటంతో క్యాంటీన్ వద్ద క్యూలో ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వారు చెబుతున్నారు. క్యాంటీన్‌ల వద్ద నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం క్యాంటీన్‌ల వద్ద చర్యలు చేపడితే పేదల ఇంకా సంతోషిస్తారు.



నరసరావుపేటలోని అన్న క్యాంటీన్ వద్ద ఎండలోనే క్యూలో ఉన్న పేదలు

ఫొటోగ్రఫీ ఒక శాస్త్రం

● సమాజాన్ని కదిలించేది.. మానవత్వాన్ని చాటేది ఫొటోగ్రఫీ
● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
● ఏఎన్‌యూలో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేదికపై వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, ఆగస్టు 19: ఫొటోగ్రఫీ అనేది ఒక శాస్త్రమని.. దానిని గుర్తించి నేడు ప్రత్యేక కోర్సుగా తీసుకురావడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు ఆధ్వర్యంలో సోమవారం 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ ఫొటోగ్రాఫర్ టి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ సమాజంలోని సంఘటనల గుర్తింపునకు ఒక అస్త్రంగా పనిచేస్తుందన్నారు. ఒక ఫొటో సమాజాన్ని కదిలించేదిగా, అలాగే మానవత్వాన్ని చాటేదిగా నిలుస్తుందన్నారు. ఆచార్య నాగార్జునవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగానికి ఫొటోగ్రఫీ కోర్సు ఒక ఆణిముత్యం అన్నారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఒక్క ఫొటో ద్వారా కొన్ని వార్తలను క్రియేట్ చేయవచ్చన్నారు. ఫొటోగ్రఫీ వృత్తిలో ఉంటూ డిప్లమా కోర్సు పూర్తిచేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గౌరవ అతిథి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ చదవలేని పుస్తకంగా రాయలేని కవితగా ఫొటోగ్రఫీ నిలుస్తుందన్నారు. జర్నలిజం, ఫొటోగ్రఫీ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సు ద్వారా ప్రతిఏడాది అనేకమంది జర్నలిస్టులను సమాజానికి పంపుతున్నట్లు చెప్పారు. ఫొటోగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో మూడు ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లను ఏర్పాటుచేశామ న్నారు. ఈ సందర్భంగా నాలుగు పుస్తకాలను విడుదల చేశారు. కవిత అనే ప్రత్యేక సంచికతోపాటు ఆధునిక ఫొటోగ్రఫీ పితామహుడు జార్జ్ ఇష్టమన్ జీవితంపై పుస్తకాన్ని, ఫొటోగ్రఫీ పదకోశం పుస్తకాన్ని కాంటెస్ట్‌లో విజేతల ఫొటోలతో ముద్రించిన క్యాటలాగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోటీలకు 800కు పైగా వచ్చిన ఎంట్రీలలో ఉత్తమమైన ఫొటోలను ఎంపికచేసి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ మాణిక్యరావు, ఫొటోగ్రఫీ కోర్స్ అధ్యాపకులు డాక్టర్ విజయభాస్కర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కోటాలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు 21న మాన్యువల్ కౌన్సెలింగ్


లాంఫాం(తాడికొండ), ఆగస్టు 19: ఈనెల 21వ తేదీన బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ ఎన్ఆర్ఐ కోటాలో మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంఫాంలోని కృష్ణ ఆడిటోరియంలో 21వ తేదీ ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీసీ విభాగంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు, రైతు కోటా కింద మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర లీగల్ సెల్ సమావేశం

తుళ్లూరు, ఆగస్టు 19: మండల పరిధిలోని వెలగపూడి సచివాలయం వద్ద గల రాష్ట్ర లీగల్ సెల్ అథారటీలో మంగళవారం జనరల్ మీటింగ్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సోమవారం ఒక ప్రకటలో తెలిపింది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25వేల 550 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కులు


ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 19: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 43వేల క్యూసెక్కుల వరదనీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదలశాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 35 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 25వేల 550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 19: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 8067క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,944 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 49,944 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీరు విడుదల

1.007 ఎంయూల విద్యుదుత్పత్తి: ఎస్ఈ కె.వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 19: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి దిగువన వున్న పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లను ఒక మీటర్ మేర, 1 గేట్‌ను మీటరున్నర మేర ఎత్తి 15,500, విద్యుదుత్పత్తి అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.007 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో 7 టీఎంసీల నీరుండగా ఆ నీరు 74.45 మీటర్లకు సమానమన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 19: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 16వేల క్యూసెకుక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


బొడ్డు వెంకటరావు (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 19: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అబ్బూరులో సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన బొడ్డు వెంకటరావు(32) అబ్బూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. విధులకు హాజరైన వెంకటరావు సబ్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వ్యవసాయకూలీలు, రైతులు సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బంధువులు ఘటనాస్థలానికి వచ్చి బావిలో నీటిని ఇంజన్ల ద్వారా బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరావుకు ఏడాదిన్నర క్రితం గణపవరం గ్రామానికి చెందిన శైలజతో వివాహం జరిగింది. వీరికి రెండునెలల వయసున్న బాలుడు ఉన్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పశ్చిమడెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 19: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 7837క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 25,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 340క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1889, తూర్పు కాల్వకు 767, పశ్చిమకాల్వకు270, నిజాంపట్నంకాల్వకు 458, కొమ్మమూరుకాల్వకు 3260క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

718 బస్తాల పసుపు విక్రయం

స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 718బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.12,800, మోడల్ ధర రూ.12,800పలికాయి. కాయక్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.12,800, మోడల్‌ధర రూ.12,500 పలికాయి.

కిడ్నీ మార్పిడి బిల్లులు అడుగుతుంటే దాడి చేసి కొట్టారు

● ఆసుపత్రి సిబ్బందిపై ఎస్పీ కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు


యడ్లపాటి సునీత

గుంటూరు, ఆగస్టు 19: తన తల్లికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు సంబంధించి ఆసుపత్రి బిల్లులు ఇవ్వమని అడిగితే తనపై ఆసుపత్రి వైద్యుడి ముందే సిబ్బంది దాడిచేసి కొట్టారని డొంకరోడ్డు 5వ లైన్‌కు చెందిన యడ్లపాటి సునీత అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... డొంకరోడ్డుకు చెందిన కోటపాటి లక్ష్మి కిడ్నీ దెబ్బతినడంతో ఆమె కుమారుడు సురేష్ కిడ్నీ దానం చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత ఏడాది మే 26న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ ఖర్చులకు గాను 8లక్షలు, ఆసుపత్రిలో వివిధ రకాల పరీక్షలకు 3లక్షలు, బయట ల్యాబ్‌లో వైద్యపరీక్షలకు మరో 4లక్షలు మొత్తం రూ.15లక్షల బిల్లు అయిందని కోటపాటి లక్ష్మి కుమార్తె సునీత తెలిపారు. ఈ ఆపరేషన్ నిమిత్తం తమకు డొంకరోడ్డులో ఉన్న ఇంటిని విక్రయించినట్లు తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని, ఈ క్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ కానీ, మెడికల్ రియింబర్స్‌మెంట్ కానీ ఇప్పించాలని కోరుతూ గత నెలలో గ్రీవెన్స్‌లో సీఎం చంద్రబాబును కలిసి వేడుకున్నామన్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన మెడికల్ బిల్లులు తెస్తే ప్రతి నెల పెన్షన్‌తో పాటు ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామని చెప్పారన్నారు. ఈ క్రమంలో తాము కొద్దిరోజులుగా తమకు ఆపరేషన్ చేసిన ఆసుపత్రి చుట్టూ బిల్లుల కోసం తిరుగుతుంటే వారు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. చివరకు డొంకరోడ్డుకు చెందిన రమణయ్య అనే వ్యక్తి ఫోన్ చేసి మీకు మెడికల్ బిల్లులు ఇవ్వాలంటే డాక్టర్ జీఎస్టీ 30శాతం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారన్నారు. మెడికల్ బిల్లులు సోమవారం ఇస్తామని పిలిచి, ఆసుపత్రికి వెళ్తే తమపై సిబ్బంది వైద్యుడి సమక్షంలోనే దాడి చేసి కొట్టారని బాధితురాలు సునీత వాపోయారు. తమపై దాడి చేసిన, చేయించిన సిబ్బంది, వైద్యునిపై చర్యలు తీసుకొని తమకు మెడికల్ బిల్లులు ఇప్పించాలని ఆమె పోలీస్ అధికారులను వేడుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 36,162 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 33,928 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 20,098 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17000	334	8000	16000
నెంబరు. 5	8500	12000	నెంబరు. 5	11700	14200
273	10000	11500	273	11500	14000
341	9000	15500	341	10000	10000
4884	–	–	4884	12000	13500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18800	తేజ	8500	18500
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	9000	12500
దేవనూరుడీలక్స్	9000	13000	దేవనూరుడీలక్స్	11000	13500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి

● జిల్లా మలేరియా కార్యాలయ ఆరోగ్యపర్యవేక్షకుడు రాంబాబు



ఏరియా వైద్యశాలలోని రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా కార్యాలయ ఆరోగ్య పర్యవేక్షకుడు జె.రాంబాబు

బాపట్లరూరల్, ఆగస్టు 19 : జ్వరాల విషయంలో ప్రజలు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా మలేరియా కార్యాలయ ఆరోగ్య పర్యవేక్షకుడు జూగుంట రాంబాబు అన్నారు. సోమవారం బాపట్ల పట్టణంలోని ఏరియా వైద్యశాల, బాపట్లలో ఉన్న మలేరియా, సెంటినరల్ సర్వేలెన్స్ హాస్పిటల్‌ను, డెంగీ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అదేవిధంగా ఔట్ పేషెంట్ విభాగం నుంచి రోజువారి హాస్పిటల్‌లో జ్వరపీడితుల నుంచి రక్తనమూనాల సేకరణ, రోగనిర్ధారణ పరీక్షలు, ఏయే ప్రాంతాల నుంచి ఎక్కువగా జ్వరాలు నమోదవుతున్నాయనే విషయం గురించి జ్వరాల నమోదు రిజిష్టర్, రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఏరియా వైద్యశాలలో జ్వరం నిమిత్తం చికిత్స పొందుతున్న రోగులను అడిగి అక్కడ ప్రత్యేక నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందుతున్న వైద్యసేవలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, సలహాల మేరకు జాగ్రత్తలు తీసుకుంటూ నియమనిబంధనలు పాటించాలని ప్రజలకు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొల్లూరు, ఆగస్టు 19 : జువ్వలపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కె.సుధాకరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 32 కేవీ లైను మరమ్మతుల కారణంగా జువ్వలపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని లంక గ్రామాల్లో మంగళవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు, ఆగస్టు 19: విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎమ్మెల్యే నరేంద్రవర్మకు రాఖీ కట్టిన కార్యదర్శి

కర్లపాలెం, ఆగస్టు 19: మండలంలోని ఏట్రవారిపాలెం, పాతనందాయపాలెం, బుద్దాం పంచాయతీల కార్యదర్శి దొంతిరెడ్డి పద్మావతి రాఖీపౌర్ణమి సందర్భంగా బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయి తినిపించి అభినందించారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు రాఖీ కడుతున్న పంచాయతీ కార్యదర్శి పద్మావతి

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులకు పిల్లలతో రాఖీ కట్టించి సన్మానిస్తున్న సెర్ప్ సంస్థవారు

కర్లపాలెం, ఆగస్టు 19 : ఐటీసీ-సెర్ప్ సంస్థవారి ఆధ్వర్యంలో బాపట్ల మండలంలోని ముత్తాయిపాలెం, జమ్ములపాలెం, కర్లపాలెం పలు గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు స్కూల్ పిల్లలతో రాఖీ కట్టించి సన్మానించారని సెర్ప్ సంస్థ సీవో అరుణ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం అరుణ్ మాట్లాడుతూ గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలని వాటిని శుభ్రపరిచే ఈ పారిశుధ్య కార్మికులు కూడా దేశాన్ని సంరక్షించే సైనికులతో సమానంగా భావించాలన్నారు. ఈ విషయాన్ని పిల్లలకు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సంస్థ ఏపీపీ నారాయణ, సుమంత్, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్యత ముద్దు.. వర్గీకరణ వద్దు

● ప్రజాసంఘాల ఐక్యవేదిక రిలే దీక్షలు ప్రారంభం



బాపట్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరాహారదీక్ష చేపట్టిన దళిత నాయకులు

బాపట్ల, ఆగస్టు 19: దళిత ఐక్యత ముద్దు వర్గీకరణ వద్దు అంటూ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ సోమవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద మూడు రోజులపాటు దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళితులు రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుదే రాజారావు, కాగిత కోటేశ్వరరావు, దగ్గుమల్లి శ్రీకర్‌బాబు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, రేకులగడ్డ చంద్రశేఖర్, సలగల చంటిబాబు, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్‌బాబు, దగ్గుమల్లి స్వాములు, సలగల ఏలీషాబాబు, దండమూడి కిషోర్‌బాబు, బిక్కా సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

భావదేవుని సన్నిధిలో విఖనస జయంతి ఉత్సవం



క్షీరభావన్నారాయణ స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

బాపట్ల, ఆగస్టు 19: బాపట్ల పట్టణంలో ఉన్న క్షీరభావన్నారాయణస్వామి వారి దేవస్థానంలో శ్రావణమాస పౌర్ణమి సోమవారం విఖసన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆచార్య స్వామివారికి ఉదయాన్నే స్నపన తిరుమంజనం, విశేష అర్చనలు అనంతరం స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విశేష అర్చనలు, గోష్ఠి కార్యక్రమం భావపురి వైఖానస సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వైఖానస ఆగమ విశిష్ఠత గురించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారు నల్లూరి మోహనరంగాచార్యులు వివరించారు. అనంతరం వైఖానస ప్రముఖులు నారాయణం శ్రీనివాసమూర్తి, నారాయణం అప్పాలచార్యులు, బృందావనం శ్రీనివాసాచార్యులు, పెద్దింటి లక్ష్మీనారాయణ దంపతులకి పురస్కారం అందించారు. కార్యక్రమంలో నల్లూరి పాంచజన్య చార్యులు, విఖనసమూర్తి, శేషుబాబు, సత్యంబాబు, దివి రాము, పరసరం శ్రీనివాసరామభార్గవ, కృష్ణభార్గవ్, ఆలయ ఈవో వెంకటేశ్వర్లు, ఆలయ అనువంశిక ధర్మకర్త రమణాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫి అద్భుతమైన కళ : ఏఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల,ఆగస్టు 19 : ఫొటోగ్రఫి అద్భుతమైన కళ అని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టి.విఠలేశ్వర్ అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ప్రగతి బాపట్ల ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సభను ఏర్పాటు చేశారు. ఈసభకు ముఖ్యఅతిథిగా ఏఎస్పీ హాజరయ్యారు. బాపట్లలో ఇంతమంది ఫొటోగ్రఫిని నమ్ముకొని జీవించటం చాలా శుభపరిణామమని అన్నారు. ఫొటోగ్రాఫర్లు తీసిన ఛాయచిత్రాలు చూసి ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఏఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో ప్రగతి బాపట్ల ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, సెక్రటరి బీఎం జయరావు, కోశాధికారి ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరి వెంకట్రావు, సీనియర్ ఫొటోగ్రాఫర్ రమణారావులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదుదారుల సమస్యను నేరుగా తెలుసుకుంటున్న ఏఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల, ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత పోలీసు అధికారులు త్వరగా పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ అన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వీకరించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై 36 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఏఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సింగయ్య, అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

● విద్యార్థులకు అవగాహనా సదస్సులో టౌన్ సీఐ అహ్మద్‌జానీ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అహ్మద్‌జానీ

బాపట్ల, ఆగస్టు 19 : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని బాపట్ల టౌన్ సీఐ అహ్మద్‌జానీ అన్నారు. సోమవారం వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బీవీ నాథ్ ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్ వీక్‌లో భాగంగా నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వర్క్‌షాపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్ చేయటమంటే చట్టవ్యతిరేక చర్యకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు గ్రహించాలని అది వారి భవిష్యత్తుపై తీవ్రపరిణామాన్ని చూపుతుందన్నారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థులకు 6 నెలలు నుంచి ర్యాగింగ్ తీవ్రతను బట్టి జీవితకాలపు జైలు శిక్ష కూడా విధించబడుతుందని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థి అవమానానికి లోనై ఆత్మహత్యకు పాల్పడే ప్రమాదం ఉంది. కావున చిన్నచిన్న ఆనందాలు కోసం జీవితాలతో ఆటలాడుకోరాదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి మాట్లాడుతూ విద్యార్థులు చట్టానికి అనుగుణంగా నడుచుకొని కళాశాల గౌరవాన్ని నిలపాలని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. డాక్టర్ ఐవీవై రామారావు, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ ఎ.విజయగోపాల్, డాక్టర్ కె.జయలలిత తదితరులు ర్యాగింగ్ పరిణామాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ర్యాగింగ్ అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నితిన్, భానుతేజ



కోల్‌కతాలో హత్యాచార ఘటనను నిరసిస్తూ పాతబస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడిన ఎస్ఎఫ్ఐ, ఐద్వా, వ్యకాస నాయకులు, విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 19: కోల్‌కతా మెడికో విద్యార్థి హత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి ఇటువంటి ఘోరాలు పునరావృతం కాకుండా మహిళల భద్రతకై కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పటిష్టచర్యలు చేపట్టాలంటూ సోమవారం బాపట్ల పాతబస్టాండ్ ఆవరణంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ కళాశాల నుంచి పాతబస్టాండ్ వరకు నిరసన ర్యాలీని చేపట్టి బస్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మేము నితిన్, ఎన్ భానుతేజ మాట్లాడుతూ కోల్‌కత్తాలోని ఆర్జిక ప్రభుత్వ వైద్యకళాశాల మెడికో విద్యార్థి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనమైందన్నారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్యవిద్యార్థులు, వైద్యులు విధులను బహిష్కరించి పెద్దఎత్తున ఆందోళన చేపడుతున్నారని ఈ ఆందోళన ఫలితంగా ఘటనలోని నిందితుల్ని పట్టుకున్నప్పటికి కళాశాల యాజమాన్యం, పోలీసుల నిర్లక్ష్యం సహించరానిదన్నారు. తక్షణమే ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఇటువంటి ఘోరాలు పునరావృతం కాకుండా మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, ఐద్వా జిల్లా నాయకురాలు టి.సుబాషిణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ కె.శరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, ఏసురత్నం, గురవారెడ్డి శ్రీను, గని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ అండగా ఉంటుంది

● మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ



పాల ఉత్పత్తిదారులకు బోనస్ నగదు అందిస్తున్న సంగం డెయిరీ మేనేజర్ గోపికృష్ణ తదితరులు

చెరుకుపల్లి, ఆగస్టు 19: సంగం డెయిరీ అందిస్తున్న పథకాలను పాల ఉత్పత్తిదారులకు అందించాలని సంగం డెయిరీ మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని యేమినేనివారిపాలెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఊచావారిపాలెం గ్రామంలో సంగం డెయిరీ కేంద్రాల్లోని సభ్యులకు బోనస్ పంపిణీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు పశువులకు ఇన్సూరెన్స్ అందించి ఆదుకుంటుందన్నారు. యేమినేనివారిపాలెం 74 మంది సభ్యులకు రూ.23 వేలు, ఊచావారిపాలెంలో 68 మంది సభ్యులకు రూ.41.18 వేలు బోనస్‌గా అందించామన్నారు. అదేవిధంగా యేమినేనివారిపాలెంలో ఇటీవల మృతి చెందిన అర్జున్ రావు కుటుంబసభ్యులకు రూ.10వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో పిట్టలవానిపాలెం చిల్లింగ్ సెంటర్ మేనేజర్ సజ్జా ప్రవీణ్, సూపర్‌వైజర్ కారంకి చైతన్యసంగం అధ్యక్షులు యేమినేని భాస్కరరావు, వేతన కార్యదర్శులు ఈపూరు వెంకటేశ్వరరావు, షేక్ ఖాదర్‌వలి, టెస్టర్ బాలాజీ, సంఘసభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

పశువుల్లో బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

● జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం హనుమంతరావు


బాపట్ల, ఆగస్టు 19 : పశువుల్లో బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణకై తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు సోమవా రం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రుసెల్లోసిస్ వ్యాధి రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుజేసే వ్యాధి అని ఈవ్యాధి పశువుల మధ్య అతివేగంగా వ్యాప్తి చెందుతుందని ఈ వ్యాధి బ్రుసెల్లా అబార్టస్ జాతి బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుందన్నారు. ఈ వ్యాధి పశువులు నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. స్త్రీలలో గర్భస్రావాలు, మోకాళ్ళ నొప్పులు, పురుషుల్లో వంధ్యత్వం సంభవిస్తాయన్నారు. ఈ వ్యాధి అన్ని వయస్సుల్లో ఉన్న ఆవు, గేదె జాతి పశువులలో కనిపిస్తుందని ఈ వ్యాధి సోకిన పశువుల్లో గర్భస్రవాలు, మాయ, పాల ద్వారా ఇతర జంతువులకు వ్యాపిస్తుందని తెలిపారు. వ్యాధి సోకిన పశువులు జ్వరం, బలహీనత, సూడి ఆఖరి దశలో గర్భస్రావం వల్ల నీరసించిపోతాయని మాయ వేయకపోవటం, సూడి నిలవకపోవటం, మగపశువులలో వృషణాళవాపులు, కీళ్ళవాపు, వంధత్వం మొదలగు లక్షణాలు కనబడుతాయని తక్షణమే వైద్యం అందించకపోతే పశువ మరణించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో బ్రుసెల్లోసిస్ వ్యాధిపై పశుపోషకులకు అవగాహన కల్పిస్తున్నామని ఈవ్యాధి నివారణకై ఈనెల 20వ తేది నుండి సెప్టెంబరు 18వ తేది వరకు జిల్లాలో 4నుండి 8నెలల వయస్సు గల ఆడదూడలకు టీకాలు వేస్తున్నామని ఈ వ్యాధినిరోధక టీకా వేయుటకు మీ వద్దకొచ్చే పశుసంవర్ధకశాఖ సిబ్బందితో సహకరించి పశువులకు టీకా వేయించుకోవాలని ఆయన కోరారు.

కుష్ఠు బాధితులకు పాదరక్షలు, దుప్పట్ల పంపిణీ

బాపట్ల, ఆగస్టు 19: బాపట్ల పట్టణంలోని బేతనీకాలనీలోని 60 మంది కుష్ఠు వ్యాధి బాధితులకు బాపట్ల డిస్ట్రిక్ లెప్రసి ఆఫీసర్ ఆధ్వ ర్యంలో ఏపీ స్టేట్ లెప్రసీ సొసైటీ వారి సౌజన్యంతో సోమవారం ఎంసీఆర్ పాదరక్షలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో లెప్రసీ సొసైటీ అసోసియేట్ ఏవీ బాషా, డీపీఎంవో సుబ్బరాజు, సచివాలయం ఏఎన్ఎమ్ భాగ్యలక్ష్మీ, బేతనీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులతో గోసేవ సంఘం ఫౌండేషన్, సమరసత సేవ ఫౌండేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 19: పిట్టలవానిపాలెం ఉన్నత పాఠశాల నందు గ్రంథాలయాధికారి ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్‌బాషా అధ్యక్షతన గోసేవ సంఘం ఫౌండేషన్, సమరసత సేవ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో పాఠశాల విద్యార్థులకు సోమవారం రామాయణంలోని పాత్రలు, వాటి విశిష్టత గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ధనుంజయ గో సేవాసంఘం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్ జయేంద్రశర్మ, కార్యదర్శి రుద్రరాజు రవివర్మ, భాస్కర్‌మోహన్‌శర్మ, ట్రెజరర్ డాక్టర్ ఎస్ఎమ్ వై ఫణేంద్రశర్మ, సమరసతసేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ అక్కల సుబ్బారెడ్డిలు పాల్గొని విద్యార్థులకు ప్రశంసపత్రాలు, గ్రంథాలయ సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎన్‌వై వి.ఫణేంద్ర మాట్లాడుతూ రామాయణంలోని పాత్రల విశిష్టత, రాఖీ పండుగ విశిష్టతలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఇ.ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రదేశాల్లోని ఫ్లెక్సీలను తొలగించాలి

బాపట్ల, ఆగస్టు 19: బాపట్ల పట్టణంలో సెంట్రల్ మీడియన్స్, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో నెలకొల్పిన ఫ్లెక్సీలు, బ్యానర్లు స్వచ్ఛందంగా వెంటనే తొలిగింపు చేసి బాపట్ల పురపాలక సంఘంనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్లెక్సీలు, బ్యానర్‌లను స్వచ్ఛందంగా తొలిగించని ఎడల సదరు వాటిని పురపాలక సంఘంచే తొలిగింపు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు నెలకొల్పటం నిషేధమైనందున బాపట్ల పురపాలక సంఘంనకు సహకరించి పట్టణ ప్రజలకు అసౌకర్యం లేకుండా పట్టణ సుందరీకరణలో అందరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

సూర్యలంక తీరంలో మహిళను కాపాడిన పోలీసు, గజ ఈతగాళ్లు

బాపట్లరూరల్, ఆగస్టు 19: బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరంలో ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన చందోలు లక్ష్మీ అనే మహిళ కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవటానికి సూర్యలంక తీరం లోపలికి వెళుతుండగా గమనించిన పోలీసులు ఆమెను రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం ఆ మహిళకు మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు రూరల్ సీఐ వద్దకు పంపించారు. మహిళను రక్షించిన వారిలో మెరైన్ హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుళ్లు సోమేశ్వరరావు, పున్నయ్య, హోమ్‌గార్డు పి.రమేష్, ఇబ్రహీమ్‌బేగ్, నాగరాజు, నాయుడు శ్రీను, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంక తీరంలో ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను కాపాడి ఒడ్డుకు చేర్చిన పోలీసు, గజ ఈతగాళ్లు

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఐదు అర్జీలు



ఆర్డీవో షారోన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

రేపల్లె, ఆగస్టు 19: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామానికి చెందిన యేమినేని వెంకటేశ్వర్లు అగ్రిమెంట్ రూపేన కొనుగోలు చేసిన ఇంటిని వేరొకరు దౌర్జన్యంగా తమను ఇంటి నుంచి గెంటివేశారని తమ ఇల్లును తమకు ఇప్పించాలని కోరారు. కనగాల గ్రామానికి చెందిన మహ్మద్ ఖాసీం పంచాయతీ బజార్ నుంచి తమ పొలాలకు వెళ్లే మార్గాల్లో అక్రమంగా నిర్మాణాలు జరిపారని వాటిని తొలగించాలని కోరారు. నగరం మండలం అల్లపర్రు గ్రామానికి చెందిన గుత్తికొండ జయంతిబాబు పొలాన్ని కొలిచి హద్దులు చూపించాలని కోరారు. నగరం మండలం పూడివాడ గ్రామానికి చెందిన తమ పంటపొలాలకు సాగునీరు అందించాలని అర్జీ ద్వారా కోరారు. పట్టణంలో 2వవార్డు గ్రామస్థుల పంట భూములకు సాగునీరు అందకుండా చేస్తున్నారని సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈసమస్యలను ఆయా శాఖలకు పంపించి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

కొల్లూరు, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొల్లూరులో మద్యం, మాంసం దుకాణాల వద్ద పారిశుధ్య సమస్య ఏర్పడి గృహాల్లో ఉండలేకపోతున్నామంటూ ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఒక అర్జీ, మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో భూమి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ మరో అర్జీ అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● ప్రత్యేక అధికారి విలియం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి విలియం

వేమూరు, ఆగస్టు 19 : ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల ప్రత్యేక అధికారి విలియం ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. హాజరైన విలియం మాట్లాడుతూ గతంలోన లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలను పూర్తి చేసే విధంగా గ్రామాల స్థాయి పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు సచివాయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బేస్ లెవల్ అలాగే స్లాబ్ లెవల్ నిర్మాణాలతో పాటు స్లాబ్ నిర్మాణం పనులు పూర్తి చేసి అరకొరగా మిగతా పనులను నిలిపివేసిన వాటిని గుర్తించాలన్నారు. సంబంధించిన లబ్ధిదారులకు వంద రోజులుగా నిర్మాణాలను పూర్తి చేసే విధంగా సహకరించాలన్నారు. ఏరోజుకు ఆ రోజు ప్రోగ్రెస్ నివేదికను ఆన్‌లైన్లో తెలియపరచాలన్నారు. గ్రామాల వారీగా ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన అధికారులకు సిబ్బందికి టార్గెట్లను కేటాయించారు. సమావేశంలో తహసీల్దార్ సుశీల, పంచాయతీరాజ్ ఏఈ మరియదాసు, హౌసింగ్ ఏఈ సునీల్ ప్రేమ్‌చంద్, 14 సచివాయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

సీతారామ మందిరానికి భూమిపూజ

● గుడి నిర్మాణానికి రూ.లక్షా ఐదు వేలు అందజేత



ఆలయ నిర్మాణానికి నగదు అందిస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

చెరుకుపల్లి, ఆగస్టు 19: గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకుని నిత్యం పూజలు చేస్తూ ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పాలవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల మందిరానికి రూ.50 వేలను సాయంగా అందించారు. అదేవిధంగా టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు రూ.10 వేలు, పూషడపు కుమారస్వామి రూ.10వేలు, బాపనయ్య రూ.25వేలు, పీటా వెంకటేశ్వర్లు రూ.10వేలను శివప్రసాద్ చేతుల మీదగా ఆలయ నిర్మాణానికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దేవాలయాల్లో పౌర్ణమి హారతులు



ఆలయాల్లో పౌర్ణమి హారతులు ఇస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 19: సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. సోమవారం భట్టిప్రోలు మండల గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ కార్యక్రమాలన ఘనంగా నిర్వహించినట్లు జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షాబంధన్ అనుబంధాల రక్షణ కోసమే హిందూ ధర్మంలో రక్షాబంధన్ ఏర్పడిన సంప్రదాయమన్నారు. అన్నాచెల్లెళ్ల బంధం కోసం రక్షాబంధనం కట్టి ఆశీర్వచనం పొందాలనేదే రక్షాబంధన్ ఉద్దేశ్యమన్నారు. పౌర్ణమి పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో దేవాలయాల్లో పౌర్ణమి హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఖండ్ సహకన్వీనర్ జంగం శ్యాంప్రసాద్, మోపిదేవి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, కాళేపల్లి గౌరీశంకర్, బాబురావు, మురళీకృష్ణ, సుబ్బారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

600 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె, ఆగస్టు 19: పేదలకు సేవ చెయ్యాలనే ఉద్దేశంతో భాగ్యశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యసేవలు అందించటం అభినందనీయమని టీడీపీ నాయకులు నర్రా సత్యనారాయణ అన్నారు. సోమవారం నగరం మండలం పమిడిమర్రు గ్రామంలో భాగ్యశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కల్వరీ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పేదలకు వైద్యసేవలు అందించటంలో ముందున్నారని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో నల్లూరు ప్రశాంత్, రమేష్, పద్మజ, టీడీపీ నాయ కులు నల్లూరు నాని బాబీ, ఆళ్ళమూడి శ్రీను, యాదల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి

» డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 19 : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి పోలీసు అధికారి నిబద్ధతతో పనిచేసి పోలీసు ప్రతిష్టను పెంపొందించాలని డీజీపీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి శ్రీసిటీ నుంచి విజయవాడ వెళుతు మార్గమధ్యంలో ఒంగోలు పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ డీజీపీకి సాదర స్వాగతం పలికారు. నూతన హంగులతో నిర్మించిన పోలీసు అతిథిగృహాన్ని పరిశీలించారు. జిల్లాలో పరిస్థితులను ఎస్పీ వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ తీసుకున్న చర్యలను డీజీపీ ప్రశంసించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసులు పారదర్శకత్యం, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్రరావు, సూర్యనారాయణ, భీమానాయక్ పాల్గొన్నారు.

ఎస్బీ నుంచి 15 మంది అవుట్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 19: ఎస్పీకి అత్యంత ముఖ్యమైన స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన చేశారు. అక్కడ అటాచ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మందిని వారు గతంలో పనిచేసిన పోలీసు స్టేషన్లకు బదిలీ చేయగా, మరో ఏడుగురిని వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుత్తం అటాచ్‌మెంటలో పనిచేస్తున్న యస్‌కె.బాజీబాషా, వివి.రమణారెడ్డి, సిహెచ్.రాము, కె.సుధాకర్‌రావు, వి.అంజిరెడ్డి, జి.నరసింహారావు, కె.చెన్నకేశవులు, జి.శ్రీనివాసులును వారు గతంలో పనిచేసిన స్టేషన్లకు పంపిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్ పనిచేస్తున్న బీఎస్‌రెడ్డి, కె.కృష్ణదాసు, బి.అవులయ్య, కె.శ్రీనివాసులు, యం.ప్రసాద్‌రెడ్డి, వైవీఆర్.కృష్ణారెడ్డి, సిహెచ్ .బాస్కరరావులను వీఆర్‌కు పిలిచారు. మొత్తం 15 మందికి స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలను జరిపించాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ వాసు

బాపట్లరూరల్, ఆగస్టు 19 : చీరాల నియోజకవర్గంలోనే అగిన స్థానిక సంస్థల ఎన్నికలను జరిపించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలం కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరువాసు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడుతూ 2021 సంవత్సరంలో రాష్ట్రం మొత్తం స్థానిక సంస్థ ఎన్నికలు జరపగా చీరాల నియోజకవర్గంలోని 24గ్రామపంచాయతీలకు, రెండు మండలపరిషత్‌లకు ఎన్నికలు జరిపించకుండా నిలిపివేశారన్నారు. అప్పటి నుండి మా చీరాల నియోజకవర్గంలో స్థానిక సంస్థలకు ప్రత్యేకాధికారుల పేర్లుతో పరిపాలన సాగిస్తున్నారని ప్రత్యేకాధికారులకు సరైన అవగాహన లేక వాళ్ళు పూర్తిగా ఆఫీస్‌లకు మాత్రమే పరిమితమవ్వటంతోపాటు వారి స్వంతశాఖల పనులకు తోడు స్పెషలాఫీసర్ పోస్టును అదనంగా నిర్వహించలేక గ్రామాలలో చాలా పనులు నిలిచిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామ సభలు జరపకుండా ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా జారీ చేసి జీవో మీద చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం మండంలోని కొంతమందిని కోర్టును ఆశ్రయించగా వేటపాలెం మండలంలోని గ్రామపంచాయతీలకు కోర్టు బైఫరకేషన్ మీద స్టే మంజూరు చేసిందని చీరాల మండలంకు ఎటువంటి అభ్యంతరం లేవన్నారు. కోర్టు తీర్పు కూడా ఇచ్చి 4 సంవత్సరాలు అయినప్పటికి ఈ రెండు మండలాలకు ఎన్నికలు జరపలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించకపోవటం వల్ల గత 5 సంవత్సరాలు నుండి మా గ్రామపంచాయతీలకు సుమారు 70కోట్ల మెర నిధులు అగిపోయాయని ఫలితంగా గ్రామంలో పారిశుద్యం, వీదిలైట్లు నిధులు లేక కునరిల్లుతున్నాయని తెలిపారు. ఇప్పటికైన గత ప్రభుత్వం విడుదల జీవోను రద్దు చేసి వెంటనే ఎన్నికలు జరిపించాలని వారు కోరారు.

ఐదేళ్ల తర్వాత తెరుచుకున్న చర్చి

మార్టూరు, ఆగస్టు 19 : మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో ఐదేళ్ల కిందట మూసివేసిన తెలుగు బాప్టిస్ట్ చర్చి తలుపులు సోమవారం తెరుచుకున్నాయి. ఈచర్చిలో కొన్ని కారణాలు వలన గత ఐదేళ్ల కిందట కొంత మంది మధ్య వివాదం జరిగింది. దీంతో కాలనీలో శాంతి భద్రతల సమస్య ఏర్పడింది. అప్పటి పోలీసులు రంగప్రవేశం చేసి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. దాంతో కారణాలు ఏమైతేనేం చర్చి తలుపులు మూతపడ్డాయి. ఎట్టకేలకు సోమవారం గ్రామ పెద్దలు కోటపాటి సురేష్, ఉప్పలపాటి చక్రపాణి లు, కాలనీలోని పెద్దలతో సంప్రదింపులు జరిపి ఒక కమిటీగా ఏర్పడి తిరిగి చర్చిని తెరిచేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చినగంజాం, ఆగస్టు 19 : కోల్‌కతా ఘటనను ఖండిస్తూ రైల్వేగేటు సెంటర్‌లో జనసేన మండల నాయకులు, కార్యకర్తలు సోమవారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నాయకుడు జి.ప్రతాప్‌కుమార్, ఘంటా వెంకటేష్, కుర్రి వాసుదేవరావు, తోట అశోకచక్రవర్తి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

చినగంజాం, ఆగస్టు 19 : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు పరాశరం రామాచార్యులు వేదమంత్రోచ్చరణతో దంపతులచే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పిచ్చయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రాఖీ వేడుకలో విషాదం

» కార్ డ్రైవర్ నిర్లక్ష్యంతో చిన్నారి దుర్మరణం



నందిని(ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 19: రాఖీ వేడుకలో విషాదం చోటు చేసుకుంది. అన్నకు రాఖీ కట్టేందుకు వచ్చిన కుటుంబంలోని చిన్నారి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి వేటపాలెం జాతీయ రహదారిలోని నాయినిపల్లి వద్ద జరిగింది. అందిన వివరాల ప్రకారం.. చినగంజాంకు చెందిన టంగు వెంకటేశ్వరరెడ్డి, లలిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అయితే వీరు చీరాల పరిధిలోని పచ్చమొగిలిలోని అన్నకు రాఖీ కట్టేందుకు లలిత, ఆమె భర్త, ఇద్దరు కుమార్తెలతో ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో వెళుతుండగా ఒంగోలు వైపు నుంచి వస్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు బైకుపైకి దూసుకెళ్లింది. దీంతో పెద్ద కుమార్తె నందిని (13) అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వీరిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైభవంగా దక్షిణామూర్తి, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠ

టంగుటూరు, ఆగస్టు 19: టంగుటూరు శివాలయం ప్రాంగణంలో దక్షిణా మూర్తి, కాలభైర స్వామిల విగ్రహాల ప్రతిష్ట సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 8.47 గంటలకు దక్షిణామూర్తి, కాలభైరవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సంతర్పణ జరిగింది. ప్రముఖ వ్యాపారి బెల్లం కోటయ్య, బెల్లం జయంత్‌బాబు, మక్కెన హరిబాబులు సతీసమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నీటి పారుదలంతా నిర్లక్ష్యమే..!



» జలవనరుల శాఖలో పర్యవేక్షణ అస్తవ్యస్తం

» కీలక అధికారుల నియామకాల్లో అడ్డగోలుగా వ్యవహరించిన గత ప్రభుత్వం

ఐదేళ్ల తమ పాలనలో సాగునీటి రంగానికి నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టులు, ఇతర జలవనరులను ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం చివరకు పర్యవేక్షణను గాలికొదిలేసింది. యంత్రాంగం నియామకాల్లోనూ అడ్డగోలుగా వ్యవహరించింది. అందుకు ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఇరిగేషన్ ఉన్నతాధికారుల నియామకాలే నిదర్శనం. పట్టించుకునేవారు లేక శాఖ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు, వందలాది నీటివనరుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది ఒకవైపు వర్షాలు లేక మరొకవైపు ప్రధాన సాగువనరులైన సాగర్ నీరు రాక జలవనరుల పర్యవేక్షణ పెద్దగా అవసరం పడలేదు. ఈ ఏడాది సాగునీటి పరిస్థితి ఆశాజనకంగా కనిపిస్తోంది. ఎన్నెస్పీ నీటి సరఫరాపై ఇప్పటికే స్పష్టత రాగా ఇతర వర్షాధార వనరులకు మరోనెల తర్వాత నీరు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ఇరిగేషన్‌శాఖ పూర్తిస్థాయి అధికారులతో సిద్ధం కావాల్సి ఉంది.

ఒంగోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగునీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణ ఒంగోలు కేంద్రంగానే సాగుతున్నాయి. ఇక్కడి సీఈ పర్యవేక్షణలో రెగ్యులర్ జలవనరులకు ఒక ఎస్ఈ, ప్రాజెక్టులకు మరొక ఎస్ఈ ఉండాలి. రెగ్యులర్ ఎస్ఈ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 4.42లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఎన్నెస్పీ, 43వేల ఎకరాలు ఉన్న మీడియం ఇరిగేషన్, మరో లక్ష 35వేల ఎకరాల ఆయకట్టు ఉన్న మైనర్ ఇరిగేషన్‌లోని 953 చెరువులు ఉంటాయి. వీటి పర్యవేక్షణ కోసం ఎస్ఈ పరిధిలో ఎన్నెస్పీ కోసం చీమకుర్తి, దర్శి అద్దంకి డివిజన్లు ఉండగా వాటికి ఈఈలు ఉన్నతాధికారులుగా ఉంటారు. ఇక మీడియం, మైనర్ ఇరిగేషన్ల నిర్వహణకు ఒంగోలు, మార్కాపురం కేంద్రాలుగా ఈఈలు ఉన్నతాధికారులుగా ఉండగా, రాళ్లపాడు ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఉంటారు.

ఆరకంగా మొత్తం రెగ్యులర్ జలవనరుల సర్కిల్ పరిధిలో ఒంగోలులోని ఎస్ఈతోపాటు ఐదు డివిజన్ల ఈఈలు కీలకం. కాగా ప్రాజెక్టుల సర్కిల్‌కు సంబంధించి ఎస్ఈ ఆ పరిధిలో గుండ్లకమ్మకు ఇద్దరు, వెలిగొండకు ముగ్గురు క్షేత్రస్థాయిలో ఈఈలు ఉంటారు.

వైసీపీ ప్రభుత్వం అన్నింటా వైఫల్యమే..

కాగా కీలకమైన రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఈ, ఈఈ పోస్టులలో గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగోన్నతుల సీనియారిటిలో నెలకొన్న వివాదాలు పరిష్కరించడంలో వైఫల్యం చెందింది. దీంతో కిందిస్థాయి అధికారులకు అడహక్ పదోన్నతులు ఇచ్చి ఇన్‌చార్జీలుగా పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగించింది. అయితే ఉమ్మడి జిల్లాలో చేసిన నియామకాలు తలాతోక లేకుండా చేయగా వారే ఇప్పటికి కొనసాగుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ విభాగం ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలలో ఉన్న నాగమురళీమోహన్ ఉన్నారు. వాస్తవంగా ఆయన స్థానం గుండ్లకమ్మ ప్రాజెక్టు-2 విభాగం ఈఈ. కాగా ఎస్ఈతోపాటు అదే విభాగంలోని ఒంగోలు డివిజన్ ఈఈగా కూడా ఇన్‌చార్జీగా ఉన్నారు. అదే ప్రాజెక్టుల విభాగం ఎస్ఈగా అబుల్ సలీమ్ పరిస్థితి చూస్తే ఆయన అసలు పోస్టు రెగ్యులర్ విభాగం మార్కాపురం డివిజన్ ఈఈ. అంటే ఇద్దరు రెండు విభాగాలకు సమానంగా ఉన్న ఎస్ఈ స్థానాల్లో ఉన్నప్పటికి ఒక విభాగంలో ఒకరి కింద, ఒకరుగా పనిచేయాలి.

అవసరం కోసం అడ్‌హక్ ప్రమోషన్లు

రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న నాగమురళీమోహన్ గుండ్లకమ్మ విషయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబుల్ సలీమ్‌కు కిందిస్థాయి అధికారిగా పనిచేయాలి. అదేసమయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అయిన అబుల్ సలీమ్ తన వాస్తవ పోస్టు అయిన మార్కాపురం రెగ్యులర్ ఈఈ వ్యవహారంలో నాగమురళీమోహన్‌కు కింది అధికారిగా పనిచేయాలి. అవసరాల కోసం ఇలా అడ్డగోలుగా అడహక్ ప్రమోషన్లు ఇవ్వడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. ఒకరి కింద మరొకరు పనిచేసేలా సమాన హోదా ఉన్న అధికారుల నియామకాలు చేపట్టలేదు. అలా చేయడంతో విధి నిర్వహణలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న విషయాన్ని నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

పనిఒత్తిడితో పట్టించుకోలేరు

ఇక ఎన్నెస్పీ అద్దంకి డివిజన్ ఈఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ ఈఈగా ఉన్న ఉమామహేశ్వరరావును ఉమ్మడి గుంటూరు జిల్లా రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. ఆ జిల్లా పరిధిలోని మీడి యం, మైనర్ వనరులతోపాటు కేడబ్ల్యూడీ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు పర్యవేక్షణ ఆయన పరిధిలో ఉంటుంది. ఒంగోలు ఎస్ఈ పరిధిలోని ఆయకట్టు కన్నా అధికంగా ఆయన పరిధిలో ఉండనుండగా అలాంటి సమాన హోదా కలిగిన సదరు అధికారి అద్దంకి ఈఈగా ఒంగోలు ఎస్ఈ కిందస్థాయి అధికారిగా పనిచేయాలి. అంతేకాక గుంటూరు జిల్లాలో ఉండి పనివత్తిడితో అద్దంకి డివిజన్ వ్యవహారాలు పట్టించుకునే అవకాశం లేదు.

రెండు పోస్టులు ఖాళీనే

ఇక ఎన్నెస్పీ దర్శి ఈఈ వెంకటరాజు గత నవంబరులో బదిలీ కాగా ముండ్లమూరు డీఈని ఇన్‌చార్జీగా నియమించారు. ఇదిలా ఉండగా రామతీర్థం రిజర్వాయర్ దర్శి ఎన్నెస్పీ-2 సబ్ డివిజన్. అలాగే చీమకుర్తి ఈఈ పర్యవేక్షణలో ఉంటుంది. ప్రస్తుతం ఆ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో కడప జిల్లాకు చెందిన రమణారెడ్డిని చీమకుర్తి ఈఈగా నియమించగా ఆయన సెలవులో వెళ్లారు. అక్కడ ఎవరి నియామకం జరక్కపోగా దర్శి-2 సబ్ డివిజన్ డీఈగా చీమకుర్తి డీఈకి ఇన్‌చార్జీ ఇచ్చారు. ఇలా కీలక పోస్టులు ఇన్‌చార్జీలుగా అది కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో ఎన్నెస్పీ, గుండ్లకమ్మ, రామతీర్థం, రిజర్వాయర్లు, కాలువల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారాయి.

యూపీ స్కూళ్లకు సర్దుపోటు

» ఇద్దరు టీచర్లు.. ఎనిమిది తరగతులు

» ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు



ఒంగోలు (విద్య), ఆగస్టు 19: రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుపోటుగా మారింది. అందరూ వ్యతిరేకిస్తున్నా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవో ప్రకారం జరుగుతున్న ప్రక్రియ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపనుంది. అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఈ టీచర్ల సర్దుబాటు ప్రక్రియతో యూపీ స్కూళ్ల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన జరుగుతున్న ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు తక్కువ మంది ఉన్న యూపీ స్కూళ్లలో ఇద్దరు టీచర్లు ఎనిమిది తరగతులు బోధించాల్సి వస్తుంది. అన్ని తరగతులకు ఇద్దరు టీచర్లు అసలు బోధించగలరా? విద్యార్థుల్లో ఏమేరకు ప్రమాణాలు పెంపొం దించగలరు? విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి మొత్తం స్కూలు అసిస్టెంట్లను తప్పించి ఇద్దరు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లను అక్కడ కొనసాగించడం వల్ల ఉపయోగం ఉండదు. పిల్లలకు పాఠాలు చెప్పేం దుకు టీచర్లు లేక వారు కూడా ఇతర పాఠశాలలకు వెళితే అవన్నీ మూసివేతకు గురయ్యే ప్రమాదం ఉంది.

91 పాఠశాలలపై సర్దుబాటు పిడుగు

జిల్లాలోని 91 ప్రాథమికోన్నత పాఠశాలలపై సర్దుబాటు పిడుగు పడనుంది. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో మొత్తం 191 యూపీ పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 8 తరగతులు ఉన్న పాఠశాలల్లో కనీసం 98 మంది విద్యార్థులు ఉంటేనే స్కూలు అసిస్టెంట్లను కొనసాగిస్తారు. అయితే జిల్లాలో 19 పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లను మిగులుగా చూపించి వారి స్థానంలో దామాషా పద్ధతిలో ఎస్జీటీలను నియమిస్తున్నారు. 10 యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. 52 యూపీ స్కూళ్లలో 8వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేరు. జిల్లాలో మార్కాపురంలోని 10వ వార్డులోని మునిసిపల్ యూపీఎస్‌లో గరిష్ఠంగా 278 మంది విద్యార్థులు ఉండగా, పెద్నూరు ఎంపీయూపీఎస్‌లో 1నుంచి 8 తరగతుల్లో కేవలం 23 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

కొన్నిచోట్ల పరిస్థితి ఇదీ.

ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం ఎంపీయూపీఎస్‌లో 1 నుంచి 8 తరగతులకు 93మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1 నుంచి 5 తరగతులకు 68 మంది, 6వ తరగతిలో 16 మంది, 7లో ఐదుగురు, 8లో నలుగురు విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రస్తుతం తొమ్మిది మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు బోధిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో ఐదుగురిని మిగులుగా గుర్తించారు. అంటే ఇక నుంచి అక్కడ నలుగురు టీచర్లే బోధించాల్సి ఉంది. అదే హైస్కూలులో 93 మంది విద్యార్థులు ఉంటే ఏడుగురు అసిస్టెంట్లు, ఒక హెచ్‌ఎం, ఒక పీడీ/పీఈటీని ఇస్తారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ఈ వివక్షతో యూపీఎస్‌లు కుదేలైపోనున్నాయి. అదేవిధంగా పెద్నూరు ఎంపీయూపీ స్కూలులో 23 మంది విద్యార్థులు ఉండటంతో అక్కడ ఇద్దరు టీచర్లే ఎనిమిది తరగతులకు బోధించాల్సి ఉంది. విద్యార్థులు ఎంతమంది ఉన్నా ఆయా తరగతులకు అన్ని సబ్జెక్టులు బోధించాల్సిందే. ఈ వాస్తవాన్ని గుర్తించి యూపీ స్కూళ్ళకు టీచర్లను కేటాయించాలని సంఘాలు కోరు తున్నాయి.

యూపీఎస్‌లపై వివక్ష

విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని కేడర్ స్ట్రెంత్ నిర్వహణలో 117 జీవోలో యూపీ స్కూళ్లకు తీవ్ర అన్యాయం జరిగింది. యూపీఎస్‌లో 98 మంది విద్యార్థులు ఉంటేనే వాటిల్లో 3 నుంచి 8 వరకు అంటే ఆరు తరగతులకు ఆరుగురు స్కూలు అసిస్టెంట్లను కేటాయించమన్నారు. 98మంది కంటే తక్కువ మంది ఉంటే 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఆధారం గా ఎస్‌జీటీలను కేటాయించమన్నారు. అంటే 97 మంది విద్యా ర్థులు ఉన్నా ఆ పాఠశా లలకు నలుగురు ఎస్‌జీటీలను మాత్రమే కేటాయిస్తారు. అదే హైస్కూళ్లలో అయితే 6 నుంచి 10 తరగతులకు 92మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న ప్రతి సబ్జెక్టుకు కనీసం ఒకరు చొప్పున ఏడుగురు స్కూలు అసిస్టెంట్లను కొనసాగి స్తారు. ఈ వివక్షను టీచర్లు, సంఘాలు ప్రశ్నిస్తు న్నాయి.



చెక్కును అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

ప్రజారోగ్యానికి భరోసా

» మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 19 : ప్రజారోగ్యానికి టీడీపీ ప్రభుత్వం భరోసాగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని చెరువుకొమ్ముపాలెంకు చెందిన రామాంజనేయులు కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు లేకపోవడంతో మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకుపోయారు. రవికుమార్ ప్రత్యేక చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15లక్షలు మంజూరు చేయించారు. చెక్కును రామాంజనేయులు బంధువులకు సోమవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో అందజేశారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి గత ప్రభుత్వం వలే కాకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మొత్తాన్ని అందిస్తుందన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద రూ.25లక్షల వరకు ఒక్కో కుటుంబం ఏడాదిలో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. టీడీపీ నేత మలాది నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటకు చెందిన సోమేపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి రవికుమార్ సోమవారం ఇంటికి వెళ్లి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు

చీరాలటౌన్, ఆగస్టు 19: నిషిద్ధ వస్తువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్టేషన్ పరిధిలోని కీర్తివారి పాలెం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు. వాహనాలు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వారికి తగు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సమాచామివ్వాలని సూచించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వేతన వెతలు

» ఉపాధి కూలీలకు నిలిచిన చెల్లింపులు

» రెండున్నర నెలలుగా అందని వైనం

» జిల్లాలో రూ.88.50 కోట్లు పెండింగ్

» కేంద్రం నిధులు ఇవ్వకపోవడమే కారణం



ఒంగోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఊతం ఇచ్చే ఉపాధి పనులు చేసిన వారికి ఇంచుమించు రెండున్నర నెలలుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఏడాది సాధారణ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులు జరిగిందే తక్కువ. వాటికి కూడా డబ్బులు రాక కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వారం వారం కూలి డబ్బులు చెల్లించాల్సి ఉండగా గత వైసీపీ పాలనలో నెలకు ఒకసారి ఇచ్చారు. ఈసారి దాదాపు రెండున్నర నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం సుమారు రూ.88.50 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో మొత్తం మండలాలు	38
ఉపాధి పనులు జరిగే పంచాయతీలు	719
మొత్తం జాబ్‌కార్డులు (కుటుంబాలు)	4.36 లక్షలు
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు	8.03 లక్షలు
పనులకు వచ్చిన కుటుంబాలు	2.71 లక్షలు
పనులకు హాజరైన కూలీలు	4.60 లక్షలు
వార్షిక పని దినాల లక్ష్యం	1.56 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పని దినాలు	1.06కోట్లు
మొత్తం కూలీలకు లభించిన వేతనం	రూ 221.62కోట్లు
పెండింగ్‌లో ఉన్న సొమ్ము	రూ 88.50 కోట్లు

సగటున ఒక్కొక్కరికి రోజుకు రూ. 208 వేతనం

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కోటి 56 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించారు. మొత్తం 38 మండలాల్లోని 729 గ్రామ పంచాయతీల పరిధిలో 4.36 లక్షల జాబ్ కార్డులు ఉండగా వాటిలో 8.03 లక్షల మంది కూలీల పేర్లు నమోదయ్యాయి. అందులో 2.71లక్షల కుటుంబాలకు సంబంధించి 4.60 లక్షల మంది పనులకు రాగా ఇప్పటి వరకు కోటి ఆరు లక్షల పనిదినాలు కల్పించారు వార్షిక లక్ష్యంలో 67.98శాతం పనిదినాలు కల్పించగా సగటు ఒక్కొక్కరికి రోజుకు రూ.208 వేతనం లభించింది. ఆ ప్రకారం మొత్తం చేసిన పని దినాలకు రూ221.62 కోట్ల మేర కూలి సొమ్ము రావాల్సి ఉంది. అయితే రెండున్నర నెలలుగా కూలీలకు వేతనాలు అందడం లేదు.

మే 20 నుంచి నిలిచిన చెల్లింపులు

అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ ఏడాది మే 20నుంచి జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం వల్ల ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండున్నర వేల కోట్ల మేర ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అయితే తక్షణం ఆ నిధులను విడుదల చేసినా అవి రాష్ట్రానికి చేరి వాటిని జిల్లాల వారీ కేటాయించి కూలీల ఖాతాలకు జమ చేయడానికి కనీసం వారం పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పెండింగ్ వేతనాలు చెల్లిస్తారన్న స్పష్టత కూడా ఆతర్వాత తేలనుంది. దాదాపు రెండున్నర నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కూలీలు కూడా ఉపాధి పనులకు ఆసక్తి చూపడం లేదు. ఈపరిస్థితుల్లో తక్షణం వేతన బకాయిలు చెల్లించి కూలీలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. వేతన సొమ్ము విడుదల చేయాలని కోరుతూ కొన్నిచోట్ల ఆందోళనలు కూడా చేస్తున్నారు.

పేద మత్స్యకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

బాపట్లరూరల్, ఆగస్టు 19 : చీరాల మండలంలో వాడరేవు గ్రామపంచాయతీ పరిధిలో చిన్న బరప, పెద్దబరప కాలనీలలోని ఇంటి స్థలాలు లేని పేద మత్స్యకార కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మేడా వెంకట్రావుతో కలిసి కాలనీవాసులు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదును అందజేశారు. ఈసందర్భంగా జెబి.శ్రీధర్ విలేకర్లతో మాట్లాడుతూ వాడరేవు ప్రాంతంలో గత 32 సంవత్సరాలు నుంచి నివసిస్తూ చేపలవేట చేసుకుంటూ వేటలేని సమయంలో భవననిర్మాణ కార్మికులుగ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చిన్నబరప, పెద్దబరప కాలనీలలోని నేటికి కొన్ని కుటుంబాలు స్వంత ఇల్లు లేక అద్దె ఇంట్లో నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2,3సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన కూడా ఎలాంటి ఫలితంలేదని వాపోయారు. ప్రభుత్వ అధికారులు ఇల్లులేనివారి వద్దకు వచ్చి వెరిఫికేషన్ మాత్రమే చుకొని వెళ్ళారని ఇళ్ళపట్టాలు మంజూరు జరగలేదని తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ హయాంలోనైన ఈ సమస్య పరిష్కారం చూపి మత్స్యకారులకు ఇళ్ళపట్టాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ మెంబరు కె.ఎల్.డి ప్రసాద్, చేపల నాగలక్ష్మీ, సురాడ శాంతి, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్తూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 19 : దత్త క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షోడశ దత్త అవతార మండప నిర్మాణానికి మొదటగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి పీఠం ఎదురుగా 18 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన మహాలక్ష్మి అమ్మవారి స్థూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కన్వీనర్ కె.ప్రమీలదేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, నున్నా శివప్రసాదరావు, గుర్రం రంగనాయకులు, కె. మరళీకృష్ణ, కె. కోటేశ్వరరావు, సుఖర్దబాబు, పూర్ణచంద్రరావు, ఆదిలక్ష్మి, చంద్రకళ, రమాదేవి, కుమారి, భక్తులు పాల్గొన్నారు.

స్వామికి లక్ష తమలపాకుల అర్చన



అద్దంకి, ఆగస్టు 19 : పౌర్ణమి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం లక్ష తమలపాకుల అర్చన నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా ఒంగోలు కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం భక్తులను పూజారులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు చెప్తున్న నేతలు

తహసీల్దార్, ఎస్ఐకు శుభాకాంక్షలు

పంగులూరు, ఆగస్టు 19 : మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్, నాగరాజారావు, ఎస్ఐ రవిబాబును టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సోమవారం వారి కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. దళితుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇరువురు అధికారులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొలకలూరి వెంకటరావు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి ఉన్నం రవిబాబు, మాజీ కార్యదర్శి తెలగతోటి రాధాకృష్ణమూర్తి, రేణంగివరం మాజీ సర్పంచ్ అమృతలూరి ఏసోబు, నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండకు జనరేటర్ అందజేత



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 19 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం కు దాతలు జనరేటర్ అందజేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి, అద్దంకి పట్టణం లోని కాకానిపాలెం కు చెందిన కూకట్ల శ్రీనివాసరావు సహకారం తో సమకూర్చిన 7 లక్షల రూపాయల విలువైన 125 కెవి జనరేటర్ ను తల్లిదం డ్రులు సుబ్బారావు, వింజావళి లు సోమవారం ప్రారంభించారు. 5 లక్షల రూపాయలతో జనరేటర్ కు అవసరమైన ప్యానల్ బోర్డు ను నర్సరావుపేట మండలం కాకానికి చెందిన దండా బ్రహ్మానందం, లక్ష్మీరాజ్యం దంపతులు ఏర్పాటు చేయించారు. జనరేటర్ ఉంచే షెడ్ ను దేవస్థానం నిధులతో నిర్మించినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులు

మార్టూరు, ఆగస్టు 19 : మార్టూరు సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్న పెద్ద అండరుపాస్ వద్ద స్థలాన్ని చదునుచేస్తున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్‌కు సంబంధించి గుంతలు, నీటి పైపులైను, ఇంకా తదితర ఏర్పాట్లు చేయనున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అత్యవసరంగా దీనిని ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దాంతో గ్రామ పంచాయతీ 15వ ఫైనాన్స్ నిధులు రూ.10లక్షలతో కంటైనర్ సులాభ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీని సంప్రదించారు. దాదాపుగా మంగళవారం ఈ కంటైనర్ హైదరాబాద్ నుంచి మార్టూరుకు చేరే అవకాశం ఉంది. ఈ కంటైనర్‌లో మహిళలకు3, పురుషులకు 3 వంతున మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు. మూడు నాలుగురోజులలో పెద్ద అండరుపాస్ వద్ద పనులను పూర్తి చేసి, సులభ్ కాంపెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్రావు

ఆదిపూడి(పర్చూరు), అగస్టు 19 : నేర నియంత్రకు ప్రజలు సహకరించాలని కారంచేడు ఎస్ఐ వెంకట్రావు అన్నారు. మండలంలోని ఆదిపూడి గ్రామంలో మంగళవారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేర నియంత్రణలో అవి ఎంతగానో దోహదపడతాయన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆడిటర్ రాము మృతి



రాము (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 19 : ఆడిటర్ కుందా వెంకటరామాంజనేయులు (రాము) (48) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని చక్రాయపాలెంకు చెందిన కుందా రాము అద్దంకిలో ఆడిటర్‌గా స్థిరపడ్డారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న రాము సోమవారం ఉదయం గుంటూరులోని వైద్యశాలలో మృతి చెందారు. రాముకు ఇద్దరు కుమారులు కాగా, దశాబ్ద కాలం కిందట ఒక కుమారుడు గోడ కూలి మృతి చెందాడు. భార్య, కుమారుడు ఉన్నారు. రాము మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

రూ.50వేల అపరాధ రుసుము

» ఇసుక అక్రమ రవాణాపై స్పందించిన మైనింగ్ అధికారులు



పందిళ్లపల్లి, చినగంజాం మండలం కవడకుదురు సరిహద్దులో ట్రాక్టర్‌లోకి నింపుతున్న ఇసుక (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, ఆగస్టు 19 : ఆగని ఇసుక అక్రమ రవాణా శీర్షికన ఈనెల 13వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనంపై మైనింగ్ అధికారులు స్పందించారు. ఈనేపథ్యంలో ఈపురుపాలెం ప్రాంతంలో సాధారణ మట్టి అక్రమ తవ్వకాలకు సంబంధించి వాహనదారుని గుర్తించి రూ.50,000 అపరాధ రుసుము వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈపురుపాలెం వీఆర్వో, తోటవారిపాలెం గ్రామ సర్వేయర్‌లు సంయుక్తంగా ఆ ప్రదేశాన్ని గుర్తించారు. సాధారణ మట్టిని అక్రమంగా తవ్వి, తరలించినట్లు ధ్రువీకరించారు. ఆ క్రమంలో టేపుతో కొలచి 975 క్యూబిక్ మీటర్ల సాధారణ మట్టిని తవ్వినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. తవ్వి నిల్వ ఉంచిన 3 కుప్పలు 210 క్యూబిక్ మీటర్లు ఉన్నట్లు కొలత వేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు, రవాణా చేసినట్లు ఆ నివేదికలో నిర్ధారించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు భూగర్భ, పోలీస్, రెవెన్యూ శాఖలతో కలసి నిరంతర నిఘా ఉంచి అక్రమ తవ్వకాలు, రవాణాదారులపై చట్టపరంగా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగిస్తాం

అద్దంకి, ఆగస్టు 19 : భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఈఈ నాగమురళీమోహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన ఆక్రమణలు తొలగించేనా కథనంపై ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రకటన విడుదల చేశారు. భవనాసి చెరువు ను ఆక్రమించిన 7గురు రైతులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను కోరినట్లు తెలిపారు.

రేపు ఉచిత ఆయుర్వేద శిబిరం

ఇంకొల్లు, ఆగస్టు 19 : వంకాయలపాడు వలేవేటి సత్యవేణి గార్డెన్స్‌లో సత్యవాణి వర్ధంతి సందర్భంగా ఉచిత మోగా ఆయుర్వేద వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి, పత్తిపాటి పుల్లారావు హాజరవతారని నిర్వాహకులు తెలిపారు.

కాలువలను అభివృద్ధి చేస్తాం

బల్లికురవ, ఆగస్టు 19 : పంట కాలువల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేప డతామని జలవనరుల శాఖ అద్దంకి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఉమామహేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో పూడిపోయిన పంట కాలువలు అన్న కథ నంపై అధికారుల ఉస్పందించారు. బల్లికురవ మండలంలోని వెంపరాల, పసుమర్రు, జంగాలపల్లి, వైద, గుంటుపల్లి మేజర్లతో పాటు మైనర్ కాలువలలో తుమ్మ చెట్లు అధికంగా ఉన్నాయని ఈ కాలువల అభివృద్ధికి రూ.53.80 లక్షల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే కాలువలను అభివృద్ధి చేస్తామని ఉమామహేశ్వరరావు తెలిపారు.

వెంటనే మురుగు తొలగించండి

బల్లికురవలో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో రవికుమార్

బల్లికురవ, ఆగస్టు 19 : తక్షణమే మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం వార్తపై కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ బల్లికురవ మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు లేకపోవడం వల్లే మురుగు నీరు నిల్వ ఉంటోందని, తక్షణమే రోడ్డు పక్కన కాలువలను తీయించి మురుగు నీరు లేకుండా చేయాలన్నారు. వారంరోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీలలో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, సర్పంచ్ పందిరి అంజిబాబు, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బాలరాజు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

అద్దంకిటౌన్, ఆగస్టు 19 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. బాలరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని శింగరకొండపాలెం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. తాగునీరు శుభ్రత, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలను వాడాలని సూచించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థాయి ఆధారంగా బోధన సాగాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 19 : ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయిలను గుర్తించి, గ్రూపులుగా విభజించి బోధన సాగించాలని ఎంఈవో-2 బి.సుధాకరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ పీ గంగాధర్, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ

రైతులకు అందుబాటులో ఉండాలి

సిబ్బందిని ఆదేశించిన ఏడీఏ మోహన్‌రావు

చెరుకూరు(పర్చూరు), అగస్టు 19 : రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని పర్చూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు ఆదేశించారు. సోమవారం మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ నేపథ్యంలో ఆర్‌బీకే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం వరి పైర్లును ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయనతోపాటు వీఏఏఎస్, రైతులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

వీరన్నపాలెం(పర్చూరు), అగస్టు 19 : పర్చూరు మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీ కృష్ణుని ఆలయంలో మంగళవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహిళలను సోదరభావంతో ఆదరించాలి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి





కలెక్టర్‌కు రాఖీ కడుతున్న మహిళలు..కమిషనర్‌కు రాఖీ కడుతున్న ఆశ్రమ మహిళలు

చీరాలటౌన్, ఆగస్టు 19 : మానవ ప్రపంచంలో మహిళను ఆదరించి సోదరాభావంతో ముందుకు సాగాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కార్యాలయ మహిళలు, స్వర్ణ రోడ్డు లోని ప్రజాహిత ఆశ్రమం ప్రతినిధులు హాజరై కమిషనర్‌కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. కమిషనర్ మాట్లాడుతూ నేటి ఆధునీకరణ ప్రపంచంలో మహిళలు, చిన్నారులపై దారుణంగా అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అనుబంధాలకు ప్రతీక రాఖీ

కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం : అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ అని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. మండలంలో సోమవారం రాఖీ పూర్ణిమను ఘనంగా నిర్వహించారు. రాఖీ పండుగను పురస్కరించుకొని అక్కలు, చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రక్షాబంధన్ కట్టి, మిఠాయిలు పెట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యూనియన్ బ్యాంకు శాఖను ప్రారంభించడానికి వచ్చేసిన కలెక్టర్ జె.వెంకటమురళికి ఎంపీడీవో కే.స్వరూపరాణి, సోపిరాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చెట్లకు రాఖీలు కట్టిన విద్యార్థులు

అద్దంకిటౌన్ : రాఖీ పండుగ సందర్భంగా కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాఖీ పండుగను వినూత్నంగా నిర్వహించారు. సోమవారం రాఖీ పండగ సందర్భంగా వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్, ఇన్‌క్లూజివ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో ఉన్న మొక్కలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మొక్కలు ఆరోగ్యంగా పెరిగి మహావృక్షాలు కావాలని, వాటిని పెంచి పెద్దవి చేసే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు, అధ్యాపకులు డీ రాజశేఖర్, మస్తాన్‌వలి, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి రాఖీ కట్టిన

తెలుగు మహిళ

అద్దంకి : అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను సోమవారం పలువురు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం సచివాలయంలోని మంత్రి చాం బర్‌లో అద్దంకి పట్టణ తెలుగు మహిళ అధ్య క్షురాలు పిన్నింటి శ్రీదేవి రాఖీ కట్టారు. పాఠశాలల విద్యార్థులతోపాటు పలువురు అన్నాచెల్లెల్లు రాఖీలు కట్టుకున్నారు.



గొట్టిపాటికి రాఖీ కడుతున్న తెలుగు మహిళ అధ్యక్షురాలు



పత్తి పైరును పరిశీలిస్తున్న బాపట్ల డాట్ కేంద్రం కోఆర్డినేటర్

రసం పీల్చే పురుగుతో జాగ్రత్త

బల్లికురవ, ఆగస్టు 19 : వాతావరణంలో బెట్ట పరిస్థితుల ప్రభావం వలన పత్తి పైరులో రసం పీల్చే పురుగులు అధికంగా ఉన్నాయని రైతులంతా అప్రమత్తంగా ఉండాలని బాపట్ల డాట్ కేంద్రం కోఆర్డినేటర్ మురళీధర్‌నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని కె.రాజుపాలెంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు పత్తిలో గులాబీ పురుగు కూడా ఉందని రైతులు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో శాస్త్రవేత్త రాధాకృష్ణ, మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో కుమారి, ఎంపీఈవో గుణశేఖర్, మౌలాలి, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

మార్టూరు : పత్తిలో గులాబీ రంగు పురుగు వలన ఎక్కువ నష్టం జరుగుతుందని, దాని నివారణకు రైతులు కృషి చేస్తూ, దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని డాట్ శాస్త్రవేత్త డాక్టరు జె.రాధాకృష్ణ రైతులకు సూచనలు చేశారు. సోమవారం మార్టూరులో తూర్పు పొలాల్లో రైతులకు చెందిన ప్రత్తి పంటలను డాట్ శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కమ్మ శివనాగేశ్వరరావు, స్వామి పత్తి పంటలో పురుగు కారణంగా నష్టపోతున్న వైనాన్ని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. దాంతో డాట్ సెంటర్ కోఆర్డి నేటర్ డాక్టరు ఆర్. మురళీధర్‌నాయక్, శాస్త్రవేత్త రాధాకృష్ణ రైతులతో మాట్లాడుతూ ప్రత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మౌలాలి, వీఏఏ అమల, వీహెచ్ఏ సువర్చల రైతులు కిషోర్ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బల్లికురవ, ఆగస్టు 19 : అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు వద్ద సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో అద్దంకి మం డలం చక్రాయపాలెంకు చెందిన పిడతల నాగార్జున(32) మృతి చెందారు. ఎస్ఐ జీవీ చౌదరి తెలిపిన వివరాల మేరకు.. చక్రాయపాలెంకు చెందిన నాగార్జున మరో వ్యక్తితో కలిసి సంతమాగులూరు అడ్డరోడ్డులో ఉన్న మరో బైకు కోసం వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి వస్తుండగా నాగార్జున నడుపుతున్న బైకు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై మృతిచెందారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ చౌదరి కేసు నమోదు చేశారు.

విద్యుత్ మోటార్ల చోరీ

» ఆందోళనలో రైతులు

» సింగిల్ ఫేస్ విద్యుత్ ఇస్తే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని విజ్ఞప్తి



చోరీకి గురైన కేబుల్ వైర్లు

బల్లికురవ, ఆగస్టు 19 : మండలంలోని కొనిదెన గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలించారు. సోమవారం పొలానికి వెళ్లిన రైతులు మోటార్లు పని చేయకపోవడంతో కేబుల్ వైర్లు కట్ చేసి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. కొంత కాలంగా దొంగలు వ్యవసాయ మోటార్లను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తున్నారని రైతులు చెప్తున్నారు. దొంగతనాల కట్టడికి పొలాల్లో సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తెస్తే వెంటనే తాము తమ సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని రైతులు అంటున్నారు. సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. కొణిదెన గ్రామంలో ఇన్నమూరి రాజేశ్వరరావు, వల్లెపు వెంకట్రావు, తోటకూర నాగయ్య, అడవి చిన బసవయ్య, పల్లపు నాగేంద్రం, అలా బ్రహ్మయ్య, పల్లె కొండ, పలువురు రైతులకు చెందిన 20 వరకు మోటార్ల కేబుల్ వైర్లు కట్ చేశారని, పంటలు పండించే సమయంలో విద్యుత్ సరఫరా లేకుండా పోయిందని పంటలు కూడా ఎండుముఖం పట్టే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వ్యవసాయ మోటార్లు చోరీలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

మేదరమెట్ల, ఆగస్టు 19 : గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కొంతమేర నియంత్రణ సాధ్యమవుతుందని కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్ అన్నారు. హెల్త్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు. హెచ్ఐవీ నియంత్రణ కరపత్రాలను ఆవిష్కరించారు. హెచ్ఐవీకి గురి కాకుండా యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్, సభ్యులు భార్గవ్, కృష్ణవేణి, సువార్త, శారద పాల్గొన్నారు.

సోపిరాలలో యూబీఐ శాఖ ప్రారంభం



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం, ఆగస్టు 19 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చినగం జాం శాఖను కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం ప్రారంభించారు. ఒంగోలు రీజినల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 78వ శాఖను చినగంజాంలో ఏర్పాటు చేసినట్లు ఒంగోలు ప్రాంతీయ అధికారి వి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవికుమార్ మాట్లాడుతూ విద్యా రుణాలు, డ్వాక్రా మహిళలకు రుణాలు, మహిళలకు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రోత్సాహక రుణాలను అర్హతను బట్టి వెంటనే మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి గ్రామస్థులు తోడ్పాటునందించాలని కోరారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాంకు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్‌ని పలువురు గ్రామ పెద్దలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు డిప్యూటీ రీజినల్ హెడ్‌లు బి.శ్రీనివాసరావు, కే.రామలింగేశ్వరరావు, ఒంగోలు చీఫ్ మేనేజర్ సాయిని సాంబశివరావు, వేములపాడు మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, చినగంజాం శాఖ మేనేజర్ వి.ప్రదీప్‌చంద్ర, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, ఎంపీడీవో కే.స్వరూపరాణి, ఏపీఎం కే.అంజిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.